సాక్షి నిజామాబాద్
గురువారం । 21 । మార్చి । 2024



సృజనాత్మకత వెలికితీసేందుకే..

విద్యార్థులోని సృజనాత్మకతను వెలికితీసేందుకే ప్రేరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెయూ రిజిస్ట్రార్ యాదగిరి తెలిపారు.

- 8లో ▸



గరిష్టం/కనిష్టం
35.5 /22.8

వాతావరణం

ఉదయం ఈదురుగాలులు వీస్తాయి. ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

లైసెన్స్‌డ్ ఆయుధాలను ఠాణాలో అప్పగించాలి

ఖలీల్‌వాడి: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఏఆర్ఎంఎస్ లైసెన్స్ పొందిన వారు తమ ఆయుధాలను సంబంధిత పోలీస్ స్టేషన్లలో అప్పగించాలని సీపీ కల్మేశ్వర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23 లోపు జమ చేయాలని నోటిఫికేషన్‌ను జారీ చేశారు. ఎవరైనా ఆయుధాలు అప్పగించకపోతే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎవరైతే ఉత్తర్వుల నుంచి మినహాయింపు కావాలనుకుంటే జిల్లా ఏఆర్ఎంఎస్ స్క్రీనింగ్ కమిటీ, నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్ కుమార్ ఫోన్ నంబరు(87125 96820)ను సంప్రదించాలన్నారు.

బడా రాంమందిర్ భూముల సర్వే



నిజామాబాద్ సిటీ: నగరంలోని బడా రాం మందిర్‌కు చెందిన భూముల సర్వే కొనసాగుతోంది. ఆలయానికి చెందిన భూములు కబ్జాకు గురైన నేపథ్యంలో దేవాదాయ, ధర్మదాయ శాఖ నాలుగు నెలల క్రితం సర్వేను చేపట్టింది. ఇందులో భాగంగా నగరంలోని న్యాల్‌కల్ ప్రాంతంలో పట్టా నం. 624లో బుధవారం దేవాదాయ శాఖ పరిశీలకురాలు కమల సమక్షంలో సర్వే అండ్ లాండ్ శాఖ సర్వేయర్లు సోమ సుదర్శన్, సయ్యద్‌లు సర్వే చేశారు. 9 సర్వేనంబర్లలో 28 ఎకరాల 32 గుంటల భూమి ఉందని గుర్తించినట్లు శాఖ సహాయ కమిషనర్ సుప్రియ తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ జూనియర్ అసిస్టెంట్లు కొండుక గంగాధర్, ప్రశాంత్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు చేపట్టాలి



మోపాల్(నిజామాబాద్‌రూరల్): వేసవిలో జిల్లా ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ అంకిత్ సూచించారు. మండలంలోని అమ్రాబాద్ గ్రామంలో బుధవారం వారు పర్యటించి నీటి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ముంపు గ్రామమైన అమ్రాబాద్‌లో మిషన్ భగీరథ ట్యాంకు, నీటి సరఫరా చేపట్టలేదని గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అమ్రాబాద్, బైరాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయాలను సందర్శించారు. అలాగే బైరాపూర్, మంచిప్ప గ్రామాల నుంచి నిజామాబాద్‌కు నీటి సరఫరా అయ్యే తూమును పరిశీలించారు. అనంతరం మంచిప్ప కొండెం చెరువు నీటి లెవల్, చెరువులో జరుగుతున్న లిఫ్టు ఇరిగేషన్ పనుల వివరాలను ఏఈ శ్రీనివాస్‌ను అడిగారు. మోపాల్ శివారులోని ఫిల్టర్ బెడ్‌ను సందర్శించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంకిత్ మాట్లాడుతూ.. వేసవిలో నీటి వృథాను అరికడుతూనే, ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఎంపీడీవో లింగం నాయక్, ఎంపీవో ఇక్బాల్ అహ్మద్, ఏఈ శ్రీనివాస్, మిషన్ భగీరథ ఏఈ వినయ్ ఉన్నారు.

'గాలికుంటు' రహిత జిల్లాగా మార్చాలి



మోపాల్(నిజామాబాద్‌రూరల్): పశువులు గాలికుంటు బారిన పడకుండా పాడి రైతులు తప్పకుండా వ్యాధి నివారణ టీకాలు వేయించాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ జగన్నాథచారి సూచించారు. జిల్లాను గాలికుంటు వ్యాధి రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యమని అన్నారు. బుధవారం మండలంలోని నర్సింగ్‌పల్లిలో ఏర్పాటు చేసిన గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని 1.50లక్షల ఆవులు, 2.20లక్షల గేదెలకు వ్యాధి నివారణ టీకాలు వేస్తామన్నారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి ప్రమోద్, మహేందర్, సుజాత, నరేశ్, చిత్ర, రజనీకాంత్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి ఎవరో?





నిజామాబాద్ పార్లమెంట్ స్థానానికి బీజేపీ, బీఆర్ఎస్‌లు ఇదివరకే బీసీ అభ్యర్థులను ప్రకటించాయి. దీంతో కాంగ్రెస్ సైతం బీసీ అభ్యర్థిని బరిలోకి దింపితే ఎలా ఉంటుందనే అంశంపై రోజువారీ సర్వేలు చేయిస్తోంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ అభ్యర్థిత్వాన్ని పార్టీ నాయకత్వం ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది.

- రోజువారీ సర్వేలు చేయిస్తున్న పార్టీ నాయకత్వం
- బీసీ కోటాలో ఎమ్మెల్సీ మహేశ్‌గౌడ్‌ను బరిలోకి దించే యోచన..
- మరోవైపు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని ప్రతిపాదించిన మహేశ్‌గౌడ్
- టికెట్టు కోసం ప్రయత్నాలు చేస్తున్న డాక్టర్ కవితారెడ్డి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్ పార్లమెంట్ బరిలో కాంగ్రెస్ అభ్యర్థిగా ఎవరిని ఎంపిక చేస్తారనే విషయమై ఆ పార్టీ శ్రేణులతో పాటు రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ఇప్పటికే బీజేపీ సిట్టింగ్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌ను అభ్యర్థిగా ప్రకటించింది. అర్వింద్ ప్రచారంలో దూసుకుపోతున్నారు. జగిత్యాలలో ఏకంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీతో సభ నిర్వహించారు. అన్ని సెగ్మెంట్లలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. బీఆర్ఎస్ సైతం తన అభ్యర్థిగా బీసీ నేత, సీనియర్ అయిన బాజిరెడ్డి గోవర్ధన్‌ను ప్రకటించింది. గోవర్ధన్ ప్రచారం మొదలుపెట్టారు. బుధవారం కోరుట్ల సెగ్మెంట్‌లో పర్యటించారు.

బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు బీసీలే కావడంతో కాంగ్రెస్ పార్టీ సైతం బీసీ అభ్యర్థిని బరిలోకి దింపితే ఎలా ఉంటుందనే విషయమై రోజువారీ సర్వేలు చేయిస్తోంది. ఈ నేపథ్యంలో పలువురి పేర్లు తెరమీదకు రాగా, కీలకంగా ముగ్గురి పేర్లు పెద్దఎత్తున చర్చకు వస్తున్నాయి.

బీసీ కోటాలో..

కరీంనగర్ లోక్‌సభ స్థానానికి పార్టీ టికెట్టును ఓసీలకు కేటాయించే పరిస్థితుల నేపథ్యంలో నిజామాబాద్ సీటును బీసీలకు ఇవ్వాలనే ఆలోచన కాంగ్రెస్ అధినాయకత్వం చేస్తుండడం గమనార్హం. మరోవైపు గత శాసనసభ ఎన్నికల్లో నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు సెగ్మెంట్లలో ఒక్క సీటును కూడా బీసీలకు కేటాయించకపోవడంతో బీసీ నాయకుల్లో అసంతృప్తి నెలకొంది. దీంతో లోక్‌సభ సీటును బీసీలకు ఇచ్చేందుకు అగ్రనేతలు ఆలోచిస్తున్నారు. ఈ క్రమంలో ఇక్కడి నుంచి ఎమ్మెల్సీ, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్‌ను బరిలోకి దింపాలని అధిష్టానం ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పార్టీ వరుసగా రోజువారీ సర్వేలు చేయిస్తోంది. ఇటీవల ఎమ్మెల్సీగా ఎన్నికైన మహేశ్ కుమార్ గౌడ్‌కు భారీగా ఆదరణ పెరిగింది. సర్వే బృందాల నివేదికల మేరకు మహేశ్‌గౌడ్‌కు సంబంధించి సానుకూలత వ్యక్తమైనట్లు సమాచారం. దీంతో సునీల్ కనుగోలు బృందం సైతం మహేశ్‌గౌడ్ అయితే బాగుంటుందని చెబుతున్నట్లు తెలుస్తోంది. అయితే పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న మహేశ్‌కుమార్ గౌడ్ ఇటీవలే ఎమ్మెల్సీగా ఎన్నికవ్వడంతో పాటు పీసీసీ అధ్యక్ష పీఠం రేసులో ముందున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మహేశ్‌గౌడ్ లోక్‌సభ బరిలోకి దిగే విషయమై ఆసక్తి చూపుతారా లేదా అనేది తెలియాల్సి ఉంది.



జీవన్‌రెడ్డి పేరు ప్రతిపాదన..

ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ మాత్రం నిజామాబాద్ లోక్‌సభ అభ్యర్థిగా ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డిని ప్రతిపాదించారు. ఇప్పటికీ ఈ సీటును జీవన్‌రెడ్డికి కేటాయించేందుకే మహేశ్‌కుమార్ గౌడ్ మొగ్గు చూపుతుండడం గమనార్హం. పక్కనే ఉన్న కరీంగనర్ సీటును ఓసీ వర్గానికి చెందిన అలిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డికి కేటాయించనున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో నిజామాబాద్ సీటును జీవన్‌రెడ్డికే కేటాయిస్తారా? లేక బీసీ అభ్యర్థికి కేటాయిస్తారా అనే విషయమై స్పష్టత రాలేదు. దీంతో కాంగ్రెస్ శ్రేణులతో పాటు ప్రత్యర్థి పార్టీలు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నాయి. మరోవైపు నిజామాబాద్ నగరానికి చెందిన డాక్టర్ కవితారెడ్డి, డాక్టర్ కేశవులు కాంగ్రెస్ టికెట్టు ఆశిస్తున్నట్లు సమాచారం.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్: యాసంగిలో వరి ధాన్యం సేకరణ కోసం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. సంబంధిత అధికారులు, సిబ్బందిని సన్నద్ధం చేశామని బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. యాసంగి సీజన్‌లో జిల్లాలో వరి సాగు సాధారణ విస్తీర్ణం 1,13,967 హెక్టార్లు కాగా, ఈసారి సాధారణానికి మించి 1,66,761 హెక్టార్లలో రైతులు వరి సాగు చేశారని కలెక్టర్ వివరించారు. 11.72 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి చేతికందుతుందని అంచనా వేస్తున్నామన్నారు. కాగా, అందులో 7.57 లక్షల మెట్రిక్ టన్నుల వరకు గంగా కావేరి, ఇతర సన్నరకాలు ఉన్నాయన్నారు. సుమారు 4.15 లక్షల మెట్రిక్ టన్నుల మేర దొడ్డురకం ధాన్యం నిల్వలు చేతికందుతాయని తెలిపారు. ఇతర జిల్లాలు, రాష్ట్రాల వ్యాపారులు, కొందరు స్థానిక వ్యాపారులకు ధాన్యం విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. కొనుగోలు కేంద్రాల ద్వారా 6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించామని వెల్లడించారు. ధాన్యం సేకరణ కోసం మొత్తం 462 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. వీటిలో సహకార సంఘాల ఆధ్వర్యంలో 417 కేంద్రాలు, ఐకేపీ ద్వారా 39, మెప్మా ఆధ్వర్యంలో ఆరు కొనుగోలు కేంద్రాలు కొనసాగుతాయని వివరించారు. రైతులు నాణ్యతా ప్రమాణాలకు లోబడి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి, ప్రభుత్వం ప్రకటించిన మేరకు పూర్తిస్థాయిలో మద్దతు ధర పొందాలని కలెక్టర్ కోరారు. కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం 'ఏ' గ్రేడ్ రకానికి క్వింటాలుకు రూ. 2,203, సాధారణ రకానికి రూ. 2,183 ధర చెల్లిస్తామన్నారు. కాగా కేంద్రాల్లో రైతులకు మౌలిక సదుపాయాలన్నీ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిసిన ఎన్‌డీసీసీబీ డైరెక్టర్లు



రాజీనామా..? అవిశ్వాసమా!

- డీసీసీబీలో నాటకీయ పరిణామాలు
- చైర్మన్ పిటిషన్‌ను కొట్టేసిన హైకోర్టు
- రాజీనామా చేస్తూ డీసీవోకు వాట్సాప్‌లో లేఖ పంపిన చైర్మన్
- నిబంధనల ప్రకారం ఇస్తేనే ఆమోదిస్తానన్న డీసీవో

సుభాష్‌నగర్: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(ఎన్‌డీసీసీబీ) చైర్మన్ భాస్కర్‌రెడ్డిపై అవిశ్వాస తీర్మానం అంశంలో నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. డైరెక్టర్లు ఇటీవల చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇచ్చిన విషయం తెలిసిందే. అవిశ్వాస తీర్మానానికి వ్యతిరేకంగా భాస్కర్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించగా.. కోర్టు బుధవారం పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో చైర్మన్ పదవికి రాజీనామా చేస్తూ పోచారం భాస్కర్‌రెడ్డి బుధవారం రాత్రి డీసీవోకు వాటాప్స్‌లో లేఖ పంపారు. ఈ అంశంపై డీసీవో స్పందిస్తూ చైర్మన్ భాస్కర్‌రెడ్డి రాజీనామా లేఖను తనకు వాట్సాప్ ద్వారా పంపించారని పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం రాజీనామా లేఖను అందిస్తేనే ఆమోదిస్తామని ఆయన స్పష్టం చేశారు. దీంతో గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న అవిశ్వాస సమావేశంపై సందిగ్ధత నెలకొంది. ఒకవేళ చైర్మన్ నిబంధనల ప్రకారం డీసీవోను నేరుగా కలిసి రాజీనామా లేఖను సమర్పిస్తే.. ప్రత్యేక సమావేశం రద్దు కానుంది. లేదంటే అవిశ్వాస తీర్మాన సమావేశం నిర్వహించనున్నారు.



క్యాంపులో 16 మంది డైరెక్టర్లు

ఎన్‌డీసీసీబీ చైర్మన్ పీఠంపై హస్తం పార్టీ గురిపెట్టిన విషయం తెలిసిందే. ఇందుకోసం నెల రోజుల నుంచి వైస్‌చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి సహా 15 మంది బ్యాంకు డైరెక్టర్లతో క్యాంపు రాజకీయాలు నడిపిస్తోంది. అందులో భాగంగా మార్చి 4న డైరెక్టర్ల సంతకాలతో కూడిన అవిశ్వాస తీర్మాన లేఖను డీసీవోకు అందజేశారు. ఎన్‌డీసీసీబీ బ్యాంకు 2020, ఫిబ్రవరిలో పాలకవర్గం ఏర్పడింది. మరో 11 నెలలు పాలకవర్గం పదవీకాలం ఉంది. 20 మంది సభ్యులు (ఓటు హక్కు కలిగిన వారు), కో-ఆప్షన్, సీఈవో, డీసీవో కలిసి మొత్తం 23 మంది ఉన్నారు.

సుదర్శన్‌రెడ్డిని కలిసిన డైరెక్టర్లు

క్యాంపులో ఉన్న డైరెక్టర్లు వైస్ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని కలిశారు. ఈసందర్భంగా అవిశ్వాస తీర్మాన ప్రత్యేక సమావేశంలో అనుసరించాల్సిన వ్యూహాలపై సుదర్శన్ రెడ్డి సూచనలు చేసినట్లు తెలిసింది. డైరెక్టర్లకు కాంగ్రెస్ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. వారి వెంట బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి, టీఎస్ మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి, దుర్కి శ్రీనివాస్, డైరెక్టర్లు ఉన్నారు.

వైస్ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డికే చైర్మన్ పదవి?

డీసీసీబీ చైర్మన్ పదవి వైస్ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డిని ఎన్నుకునేందుకు మెజారిటీ డైరెక్టర్లు సిద్ధంగా ఉన్నారు. ఆయన ఆధ్వర్యంలోనే డైరెక్టర్ల క్యాంపు కొనసాగుతోంది. రమేశ్‌రెడ్డి కాంగ్రెస్ మాజీమంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి సమీప బంధువు కావడంతో పార్టీలో ఒకరిద్దరు మినహా మిగతా ప్రజాప్రతినిధులు, సీనియర్ల మద్దతు ఆయనకు ఉంది. ప్రస్తుత చైర్మన్ భాస్కర్‌రెడ్డిపై ఆది నుంచి డైరెక్టర్లలో ఉన్న వ్యతిరేకతను అనుకూలంగా మల్చుకుని అదును చూసి అవిశ్వాసానికి తెరలేపారని ప్రచారం సాగుతోంది.

లక్ష్యానికి చేరువలో విద్యుదుత్పత్తి

- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 75 ఎంయూల టార్గెట్
- ఇప్పటివరకు 73.5 ఎంయూల ఉత్పత్తి



విద్యుదుత్పత్తి చేస్తున్న టర్బయిన్‌లు

బాల్కొండ: శ్రీరాంసాగర్‌లో విద్యుదుత్పత్తి లక్ష్యానికి చేరువలో ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జల విద్యుత్తు సౌధ 75 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి టార్గెట్ విధంగా.. ఇప్పటి వరకు 73.5 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది. కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదల ఆధారంగా కేంద్రంలో విద్యుదుత్పత్తి కొనసాగుతోంది. నాలుగు టర్బయిన్ల ద్వారా 36 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేసే సామర్థ్యం ఉంది. కాగా, ప్రాజెక్ట్ నుంచి ప్రస్తుతం కాకతీయ కాలువ ద్వారా 3500 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతుండడంతో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. రెండు టర్బయిన్‌ల ద్వారా 7.6 మెగావాట్ల ఉత్పత్తవుతోంది. రోజుకు 0.168 మిలియన్ యూనిట్ల విద్యుత్ ప్రొడక్షన్ జరుగుతోంది. ప్రస్తుత నెలలో ఇప్పటి వరకు 4.52 మిలియన్ యూనిట్లు ఉత్పత్తయినట్లు జెన్‌కో డీఈ శ్రీనివాస్ తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మరో పది రోజుల గడువు ఉంది. ఈ నెలాఖరు వరకు కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదల చేపట్టాలని ప్రాజెక్టు అధికారుల ప్రణాళిక ఉంది. మరో 1.5 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి జరిగితే లక్ష్యం పూర్తవుతుంది. గతేడాది లక్ష్యానికి మించి ఉత్పత్తి చేపట్టినా.. ప్రస్తుత ఏడాది లక్ష్యాన్ని చేరుకోనున్నారు. అయితే ఉత్పత్తి టార్గెట్‌ను ప్రతియేటా తగ్గిస్తున్నారు. గతంలో 90 మిలియన్ యూనిట్లు ఉండగా.. ప్రస్తుతం 75 మిలియన్ యూనిట్లకు కుదించారు.

బల్దియా చైర్‌పర్సన్ ఎన్నికపై ఉత్కంఠ

- నేడు ఆర్మూర్‌లో ఎన్నికకు సర్వం సిద్ధం
- పోటీపడుతున్న సంగీత, లావణ్య
- కీలకం కానున్న 20 మంది తిరుగుబాటు కౌన్సిలర్లు
- బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి కౌన్సిలర్ల వలసలు



ఖాందేశ్ సంగీత   వన్నెల్‌దేవి లావణ్య

ఆర్మూర్: ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్‌ను గురువారం ఎన్నుకోనున్నారు. ఈ మేరకు ఆర్డీవో రాజాగౌడ్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహించనున్నారు. గతేడాది డిసెంబర్ 12న బీఆర్ఎస్‌లోని తిరుబాటు కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానానికి తెర లేపారు. అనంతరం ఈ మూడు నెలల కాలంలో మున్సిపల్ కౌన్సిలర్లు గ్రూపులు కడుతూ పార్టీలు ఫిరాయించడంతో బలాబలాలపై స్పష్టత లేకుండా పోయింది. కౌన్సిలర్లు పార్టీలను విడిచి చైర్ పర్సన్ పీఠం కోసం చేస్తున్న రాజకీయం స్థానికంగా చర్చనీయాంశమైంది. చైర్ పర్సన్ పీఠం బీసీ మహిళలకు రిజర్వు కాగా బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన రెండో వార్డు కౌన్సిలర్ ఖాందేశ్ సంగీత శ్రీనివాస్, 23వ వార్డు కౌన్సిలర్ వన్నెల్‌దేవి లావణ్య శ్రీనివాస్‌లు చైర్ పర్సన్ రేసులో ఉన్నారు.

25 మంది కౌన్సిలర్లు హాజరైతేనే..

ఆర్మూర్ బల్దియాలో 36మంది కౌన్సిలర్లు ఉండగా ఎక్స్‌అఫీషియో మెంబర్‌గా ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డికి సైతం ఓటు హక్కు ఉంది. దీంతో మొత్తం ఓట్ల సంఖ్య 37కు చేరింది. ఈ సంఖ్యలో 25 మంది కోరం సభ్యులు హాజరైన పక్షంలోనే చైర్‌పర్సన్ ఎన్నిక సమావేశం నిర్వహించడానికి ఆస్కారం ఉంటుంది. మొత్తం ఓట్లలో 19 మంది కౌన్సిలర్ల ఓటు వచ్చిన వారిని చైర్ పర్సన్‌గా ఎన్నికైనట్లు ప్రకటిస్తారు.

గైర్హాజరు కానున్న బీజేపీ కౌన్సిలర్లు..!

బీజేపీకి చెందిన ఐదుగురు కౌన్సిలర్లతో పాటు ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి సమావేశానికి గైర్హాజరై నిరసన తెలపాలని భావిస్తున్నట్లు సమాచారం. చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం సమాశానికి హాజరై తిరుగుబాటు కౌన్సిలర్లకు అండగా నిలిచిన బీజేపీ కౌన్సిలర్లు జీవీ నర్సింహారెడ్డి, సాయి, కంచెట్టి లక్ష్మిగంగాధర్, పాలెపు లతరాజు, ఆకుల సంగీత శ్రీనివాస్ ప్రస్తుత సమావేశానికి గైర్హాజరు కానున్నట్లు తెలుస్తోంది. మరో వైపు బీజేపీ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్లను కట్టడి చేయడం కోసం బీజేపీ విప్‌ను జారీ చేయడానికి ఆస్కారం ఉంది.

కౌన్సిలర్లతో కాంగ్రెస్ ముఖ్యనాయకుల సమావేశం

పండిత్ వినీతను వ్యతిరేకించిన 20 మంది తిరుగుబాటు కౌన్సిలర్ల నిర్ణయం ప్రస్తుత చైర్ పర్సన్ ఎన్నికలో కీలకం కానుంది. తిరుబాటు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరిన సమయంలో వారి గ్రూప్‌లోని 20 మంది కౌన్సిలర్లు ఎవరిని చైర్ పర్సన్‌గా ఎంచుకుంటే వారికే తమ పార్టీ అధిష్టానం మద్దతు ఇస్తుందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాట ఇచ్చారు. దీంతో క్యాంపునకు తరలి వెళ్లిన ఈ కౌన్సిలర్ల నిర్ణయమే కీలకం కానుంది. తిరుబాటు కౌన్సిలర్లు, వినిత వర్గానికి చెందిన కౌన్సిలర్లు విడతల వారిగా సుమారు 23 మంది కౌన్సిలర్లు ఇప్పటికే కాంగ్రెస్ నాయకుడు వినయ్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్, బీజేపీల నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. కాగా ఎవరి గ్రూపుల్లో వారు కొనసాగుతున్నారు. ఇదిలా ఉండగా చైర్ పర్సన్ అభ్యర్థిని ఎంచుకోవడం కోసం కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు బుధవారం రాత్రి జిల్లా కేంద్రంలో కౌన్సిలర్లు, నియోజకవర్గ నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు.

'ఈ-శ్రామ్' క్లెయిమ్‌ల దరఖాస్తులను సమర్పించాలి

నిజామాబాద్‌నాగారం: ఈ-శ్రామ్ పోర్టల్‌లో క్లెయిమ్‌ల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కార్మికశాఖ అధికారి యోహాన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2022 మార్చి 31వ తేదీ నాటికి పేర్లు నమోదు చేసుకున్న అసంఘటిత రంగ కార్మికుల్లో.. ఎవరైనా ప్రమాదవశాత్తు మరణించినా, శాశ్వత అంగవైకల్యానికి గురయినా క్లెయిమ్ కోసం ఈ నెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 2022 మార్చి నెలాఖరు కంటే ముందు ప్రమాదవశాత్తు మరణించినా/శాశ్వత అంగవైకల్యానికి గురైన వారి సంబంధీకులు క్లెయిమ్‌ల కోసం అదనపు కలెక్టర్‌కు సమర్పించాలని పేర్కొన్నారు.

వ్యాక్సిన్ కొరత!

- అందుబాటులో లేని నాలుగు ముఖ్యమైన డోసులు
- చిన్నారుల టీకాల కోసం తల్లిదండ్రుల ఎదురుచూపులు
- ఆరోగ్య కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు

నిజామాబాద్‌నాగారం/బోధన్: జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో చిన్నారుల వ్యాధి నిరోధక టీకాల(వ్యాక్సిన్స్) కొరత ఏర్పడింది. బిడ్డ పుట్టిన వెంటనే ఇచ్చే బీసీజీ టీకాతో పాటు నిర్దిష్ట కాల పరిమితితో ఇచ్చే వివిధ రకాల వ్యాక్సిన్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాల్లో సరిపడా అందుబాటులో లేవు. దీంతో పిల్లల తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. వైద్య సిబ్బందితో మొరపెట్టుకుంటున్నారు. ప్రభుత్వం నుంచి సరిపడా టీకాలు సరఫరా కావడం లేదని వైద్య సిబ్బంది సమాధానం చెబుతున్నారు.

ఆందోళనలో తల్లిదండ్రులు

జన్మించిన శిశువు నుంచి.. నెలలు నిండిన చిన్నారులకు.. అనారోగ్య సమస్యలు రాకుండా ఉండేందుకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో వ్యాక్సిన్లు ఇస్తారు. ముఖ్యంగా పుట్టిన బిడ్డకు ఇచ్చే బీసీజీ టీకాతో పాటు 5, 10, 14 వారాలు, 9 నెలలు, 16 నుంచి 24 నెలల మధ్య నిడివితో బీసీజీతో పాటు పెంటా వ్యాక్సిన్లు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే చిన్నారులకు ఇచ్చే 11 వ్యాక్సిన్‌లలో.. ముఖ్యమైన నాలుగు టీకాలకు సంబంధించిన డోసులు అందుబాటులో లేవు. ఇందులో జేఈ(మెదడువాపు వాధి రాకుండా), డీఈటీ(డిఫ్తీరియా, ధనుర్వాతం, కోరింత దగ్గు రాకుండా), పీసీవీ(శ్వాసకోస వ్యాధులు రాకుండా), పెంటావాల్యుట్ టీకాల కొరత ఏర్పడింది. దీంతో చిన్నపిల్లల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

టీకాలు లేక వెనుదిరిగిన బాలింతలు

సాలూర మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహిస్తున్న ఆరోగ్య ఉప కేంద్రానికి బుధవారం చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాల కోసం 30 నుంచి 35 మంది వరకు బాలింతలు వచ్చారు. సరిపడా టీకాలు లేవని వైద్య సిబ్బంది చెప్పడంతో చాలా మంది వాపస్ వెళ్లి పోయారు. కొందరు వైద్య సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. కొందరు తాము వారాల తరబడి తిరుగుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. టీకాల సరఫరా, పర్యవేక్షణ విషయంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు నిర్లక్ష్యం వహించడంపై పిల్లల తల్లిదండ్రుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.



సాలూరలోని ఆరోగ్య ఉప కేంద్రంలో చిన్నారులతో తల్లిదండ్రులు

కొరత లేకుండా చూస్తాం

జిల్లాలో అక్కక్కడ పీహెచ్‌సీల్లో నాలుగు వ్యాక్సిన్ల కొరత ఉన్నట్లు తెలిసింది. వెంటనే నిల్వ ఉన్న దగ్గర నుంచి పీహెచ్‌సీలకు సరఫరా చేస్తాం. హైదరాబాద్ నుంచి కూడా స్టాక్ రెండు, మూడు రోజుల్లో రానుంది. సాధ్యమైనంత వరకు ఇబ్బందులు రాకుండా చూస్తున్నాం.

– డాక్టర్ అశోక్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి

క్లుప్తంగా

ఎస్సారెస్పీని సందర్శించిన సీసీఎఫ్ అధికారి



డొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలోని జీజీ నడ్కుడ, చిన్నయానం శివారులోని ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతాన్ని అటవీశాఖకు చెందిన బాసర సర్కిల్ సీసీఎఫ్ అధికారి శర్వణన్ తన కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించా రు. సూర్యోదయానికి ముందే కుటుంబసభ్యులతో బ్యాక్ వాటర్ ప్రాంతానికి చేరుకున్న ఆయనకు డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ అధికారి సుధాకర్ స్వాగతం పలికారు. జింకలు, విదేశీ పక్షులను బైనాక్యులర్స్ ద్వారా తిలకించారు. కుటుంబ సభ్యులతో కలిసి సరదాగా ఫొటోలు దిగారు.

మోడల్ స్కూల్ తనిఖీ

బాల్కొండ: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌ను పాఠశాలల జాయింట్ డైరెక్టర్ సరోజనదేవి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల రిజిస్టర్లను పరిశీలించారు. ఆమె వెంట మోడల్ పాఠశాలల నోడల్ అధికారి నవీన్, ప్రిన్సిపల్ శంకర్, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

మూల్యాంకనానికి హాజరుకావాలి

నిజామాబాద్‌అర్బన్: ఈనెల 22న నిర్వహించనున్న ఇంటర్ జవాబుపత్రాల మూల్యాంకనానికి అధ్యాపకులు తప్పకుండా హాజరుకావాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి రఘురాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మూల్యాంకన కేంద్రంలో బోటనీ, జువాలజీ, హిస్టరీ జవాబుపత్రాల మూల్యాంకన విధులు 24వ తేదీకి బదులు 22 నుంచి నిర్వహించనున్నామన్నారు. హిస్టరీ, బొటనీ, జువాలజీ జవాబు పత్రాల మూల్యాంకనం 24వ తేదీకి బదులు 22న ప్రారంభమవుతుందన్నారు. మూల్యాంకన విధులు నిర్వర్తించనున్న అధ్యాపకులను ప్రిన్సిపాళ్లు 21వ తేదీన రిలీవ్ చేయాలని ఆదేశించారు. అధ్యాపకులను రిలీవ్ చేయని ప్రిన్సిపాళ్లపై ఇంటర్ బోర్డు శాఖాపరమైన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు.

హద్దులు చూపి సహకరించండి

- రైతులకు ఫోన్లు చేసి కోరుతున్న అధికారులు
- హైవే విస్తరణలో భాగంగా బైపాస్ రోడ్డు కోసం..



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో (ఫైల్)

మోర్తాడ్(బాల్కొండ): ''హలో.. మేము తహసీల్దార్ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నాం.. మీకు సంబంధించిన భూమి జాతీయ రహదారి విస్తరణలో భాగంగా నిర్మించే బైపాస్ రోడ్డు కోసం సేకరిస్తున్నాం. మీరు వచ్చి హద్దులను చూయించి మాకు సహకరించాలి..'' ఇలా రెండు మూడు రోజుల నుంచి రెవెన్యూ ఉద్యోగులు రైతులకు ఫోన్‌లు చేస్తూ భూ సేకరణ కోసం సహకారం కోరుతున్నారు. మోర్తాడ్‌లో జాతీయ రహదారి 63కి బైపాస్ రోడ్డు నిర్మించేందుకు 30.154 హెక్టార్ల భూమిని సేకరించనున్నారు. భూసేకరణ కోసం ఇటీవల ఆర్మూర్ ఆర్డీవో రాజుగౌడ్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. సదస్సుకు హాజరైన రైతులు తాము భూమి ఇచ్చేది లేదని చావనైనా చస్తాం కానీ భూ సేకరణ, రోడ్డు విస్తరణ పనులు సాగనివ్వమని ఖరాఖండిగా చెప్పారు. తొలి విడత సర్వేలో బైపాస్ రోడ్డు కోసం ఎక్కడి నుంచి ఎక్కడి వరకు భూమిని సేకరించనున్నారో అధికారులు గుర్తించి బౌండరీ ఫిక్స్ చేశారు. సేకరించే భూమిని గుర్తించినా ఏ రైతుకు సంబంధించిన భూమి హద్దు ఎంత వరకు ఉందనే విషయం రైతులు అందుబాటులో ఉంటేనే తెలుతుందని అధికారులు భావిస్తున్నారు. రైతులకు ఫోన్లు చేస్తూ ఎంజాయ్‌మెంట్ సర్వే పూర్తి చేయడానికి అందుబాటులోకి రావాలని రెవెన్యూ యంత్రాంగం విన్నవిస్తోంది. రైతులు మాత్రం తమ సహకారం లేకుండా భూ సేకరణ ఎలా నిర్వహిస్తారని ప్రశ్నిస్తూ అధికారులకు ఎలాంటి సహకారం అందించేది లేదని పట్టుదలతో ఉన్నట్లు తెలుస్తోంది. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా జిల్లాలోని ఐదు గ్రామాల్లో 83.895 హెక్టార్ల భూమిని సేకరించాల్సి ఉంది. ఎక్కడ కూడా భూ సేకరణకు వేగంగా చర్యలు తీసుకోని అధికారులు కేవలం మోర్తాడ్‌పైనే ఎందుకు దృష్టి సారించారని ప్రశ్నిస్తున్నారు. రెవెన్యూ అధికారులు ఎక్కడకు పిలిచినా వెళ్లేది లేదని భూ సేకరణ, బైపాస్ రోడ్డు నిర్మాణం పనులను అడ్డుకుంటామని రైతులు స్పష్టం చేస్తున్నారు. భూ సేకరణ అంశం ఎలాంటి పరిస్థితులకు దారి తీస్తుందో వేచి చూడాల్సి ఉంది.

రైతుల సహకారం కోరుతున్నాం

బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం భూ సేకరణ చేయడానికి రైతుల సహకారం కోరుతున్నాం. బౌండరీ ఫిక్సింగ్ పూర్తయ్యింది. ఎంజాయ్‌మెంట్ సర్వే కూడా పూర్తయ్యింది. బైపాస్ రోడ్డు నిర్మాణంలో ఏమైనా మార్పులు ఉంటే భూ సేకరణలో తేడా ఉండొచ్చు.

– సత్యనారాయణ, తహసీల్దార్, మోర్తాడ్

సృజనాత్మకత వెలికితీసేందుకే 'ప్రేరణ'



కార్యక్రమంలో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ యాదగిరి

తెయూ(డిచ్‌పల్లి): విద్యార్థుల్లోని ప్రతిభ, సృజనాత్మకతను వెలికి తీసేందుకే 'ప్రేరణ' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఎం యాదగిరి తెలిపారు. తెలంగాణ కామర్స్ అసోసియేషన్ సౌజన్యంతో యూనివర్సిటీ కామర్స్ విభాగం ఆధ్వర్యంలో వర్సిటీ పరిధిలోని డిగ్రీ స్థాయి కామర్స్ విద్యార్థులకు బుధవారం ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రిజిస్ట్రార్ యాదగిరి మాట్లాడుతూ.. ఆధునిక ప్రపంచంలో కామర్స్‌కు ఉజ్వలమైన భవిష్యత్ ఉందన్నారు. వ్యాపారరంగంలో ముందున్న దేశమే ఆర్థికంగా అగ్రగామిగా ఉంటుందన్నారు. వాణిజ్య శాస్త్రాన్ని అభివృద్ధి పర్చాల్సిన బాధ్యత విద్యావేత్తలతోపాటు శాసనకర్తలపై ఉంటుందన్నారు. గౌరవ అతిథిగా హాజరైన ఉస్మానియా యూనివర్సిటీ సీనియర్ ప్రొఫెసర్ కృష్ణ చైతన్య మాట్లాడుతూ.. కామర్స్ విద్యార్థులు మార్కెట్లో వస్తున్న ఆధునిక మార్పులను అధ్యయనం చేయాలన్నారు. ఉపాధి, ఉద్యోగావకాశాలు విరివిగా లభించే అవకాశాలున్నాయన్నారు.



వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థినులు

వివిధ అంశాల్లో పోటీలు..

వర్సిటీ పరిధిలోని కళాశాలల నుంచి వచ్చిన 400 మంది విద్యార్థులు వ్యాసరచన, ఉపన్యాసం, జస్ట్ ఏ మినిట్, ఫేస్ పెయింటింగ్, రంగోలి, కామర్స్ క్విజ్, బిజినెస్ స్కిల్స్ తదితర అంశాల్లో పోటీలు నిర్వహించారు. ఒక్కో విభాగంలో ముగ్గురు విజేతలను ప్రకటించి బహుమతులు అందజేశారు. విజేతలు ఏప్రిల్ 23న రాష్ట్రస్థాయిలో ప్రేరణలో పాల్గొంటారని ఆర్గనైజింగ్ సెక్రటరీ జి రాంబాబు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీహెచ్‌ఆరతి, ఆర్గనైజింగ్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్, ఆర్గనైజ్ మెంబర్లు గంగాధర్, శ్వేత, రాజు, ఆయా కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి బేస్‌బాల్‌కు ఎంపిక



ఎంపికైన క్రీడాకారిణులతో రీజనల్ కో ఆర్డినేటర్ అలివేలు, తదితరులు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు పంజాబ్‌లోని సంగూర్‌లో నిర్వహించనున్న 31వ జాతీయ జూనియర్ బేస్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా క్రీడాకారిణులు ఎంపికైనట్లు జిల్లా బేస్‌బాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.మధుసూదన్‌రెడ్డి, సొప్పరి వినోద్ కుమార్ తెలిపారు. డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) సాంఘికసంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థినులు దీప, కీర్తన, సుద్దపల్లి గురుకుల కళాశాల క్రీడాకారిణులు దేవిశ్రీ, సింధు, ఆర్మూర్ గురుకుల కళాశాల విద్యార్థినులు వైష్ణవి, నిహారిక ఎంపికైన వారిలోఉన్నారు. క్రీడాకారిణులను బుధవారం ధర్మారం(బి) గురుకుల కళాశాలలో సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ రీజినల్ కో ఆర్డినేటర్ కే అలివేలు, జిల్లా కో ఆర్డినేటర్ బి సంగీత, స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ నీరజారెడ్డి అభినందించారు. జిల్లా బేస్‌బాల్ సంఘం కోశాధికారి బొజ్జ మల్లేశ్‌గౌడ్, ఉపాధ్యక్షులు మర్కంటి గంగామోహన్, సంఘ సభ్యులు తేజావత్ గంగాధర్, సాఫ్ట్‌బాల్ అకాడమీ కోచ్ నరేశ్, పీఈటీ జోత్స్న పాల్గొన్నారు.

సేవాభావాన్ని అలవాటు చేసుకోవాలి

తెయూ(డిచ్‌పల్లి): విద్యార్థులు చదువుతోపాటు సేవాభావం, క్రమశిక్షణ అలవాటు చేసుకోవాలని అప్పుడే చదువుకు సార్థకత ఉంటుందని తెలంగాణ యూనివర్సిటీ ప్రిన్సిపల్ సీహెచ్ ఆరతి అన్నారు. తెయూ ఎన్ఎస్ఎస్ యూనిట్-1, యూనిట్-4 ఆధ్వర్యంలో డిచ్‌పల్లి మండలం సాంపల్లి, సాంపల్లి తండాలో ఈ నెల 14వ తేదీ నుంచి కొనసాగుతున్న వేసవికాల ప్రత్యేక శిబిరం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ప్రిన్సిపల్ ముఖ్యఅతిథిగా హాజరై వలంటీర్లకు సర్టిఫికెట్లు అందజేశారు. యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ కే రవీందర్‌రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్స్ ప్రవంతి, స్వప్న, అధ్యాపకులు పాత నాగరాజు, పున్నయ్య, శ్రీనివాస్, దత్తహరి, మాజీ సర్పంచ్ అంతరెడ్డి మోహన్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠ ధామంలో పీడీఎస్ బియ్యం పట్టివేత



మాచారెడ్డి: పాల్వంచ మండలం భవానిపేట తండా వైకుంఠధామంలోని ఓ గదిలో నిల్వ ఉంచిన 29క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సీఐ తిరుపయ్య సిబ్బందితో కలిసి దాడి చేశారు. తండాకు చెందిన మలావత్ మోహన్ నిల్వ ఉంచిన బియ్యాన్ని స్వాధీనం చేసు కొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత

- నిబంధనలకు విరుద్ధంగా వెంచర్‌లో కల్యాణ మండప నిర్మాణం
- మాజీ ప్రజాప్రతినిధిని నమ్ముకొని ఆగమైన ప్రధాన సామాజికవర్గం!
- సొంత నిధులతో నిర్మించామని కుల సంఘం ప్రతినిధుల ఆవేదన

మాక్లూర్: నియోజకవర్గస్థాయి ప్రజాప్రతినిధి తమ వెనుక ఉన్నాడనే నమ్మకంతో ఏకంగా ప్రైవేట్ వెంచర్‌లో ఓ ప్రధాన కులసంఘం కల్యాణ మండప నిర్మాణ పనులను ప్రారంభించి దిక్కుతోచని స్థితిలోపడింది. మండలంలోని మానిక్‌బండార్ శివారులో 63వ నంబర్ జాతీయ రహదారికి అతిసమీపంలో సుమారు 14 ఎకరాల్లో ఓ వెంచర్‌ను ఏర్పాటు చేశారు. అప్పుడు నిబంధనల ప్రకారం 10శాతం భూమిని పార్కు, ఆలయం తదితర అవసరాల కోసం వదిలిపెట్టారు. అత్యధిక ఓట్లు ఉన్న కులానికి గాలం వేసి అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు అప్పటి ప్రజాప్రతినిధి నెల రోజుల ముందు ఆ సామాజికవర్గానికి కల్యాణ మండపం నిర్మాణం కోసమని వెంచర్‌లో భూమి పూజ చేశారు. ప్రజాప్రతినిధి మీద నమ్మకంతో మండలంలోని సామాజిక వర్గానికి చెందిన కులసంఘం సభ్యులు పనులను వెంటనే ప్రారంభించి గోడల వరకు నిర్మాణం పూర్తి చేశారు. ఆ తరువాత ఎన్నికల రావడం.. సదరు ప్రజాప్రతినిధి ఓటమి చెందడంతో అసలు కథ మొదలైంది. మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా వెంచర్‌లో కల్యాణ మండపం నిర్మిస్తున్నారని సంబంధిత అధికారులు రంగంలోకి దిగారు. సొంత నిధులు రూ.20లక్షలతో చేపట్టిన పనులను కూలి్చవేసి మళ్లీ పనులు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. దీంతో ఆ సామాజికవర్గానికి చెందిన కులసంఘం సభ్యులు మాజీ ప్రజాప్రతినిధిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, ఇదే ప్రాంతంలో జర్నలిస్టులకు, మాల సంఘానికి కేటాయించిన స్థలాల్లో కూడా ఎలాంటి నిర్మాణాలకు అవకాశం లేదని తేలింది. అధికారంలో ఉన్న సమయంలో సదరు ప్రజాప్రతినిధి నోటిమాటపై ఎవరికి పడితే వారికి స్థలాలు కేటాయించారని, ఇప్పుడు అందరూ ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మాజీ ప్రజాప్రతినిధి తన హయాంలో ఖాళీ స్థలాలను ఇష్టారీతిన కట్టబెట్టాడని, వాటిని అధికారులు స్వాధీనం చేసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



మున్సిపల్ అధికారులు కూల్చివేసిన నిర్మాణం

టేకు దుంగలు, నాటు తుపాకీ స్వాధీనం



తండాల్లో టేకు దుంగలను స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

గాంధారి(ఎల్లారెడ్డి): మండలంలోని కాయితీతండా, మర్లకుంట తండాల్లో బుధవారం పోలీసు, రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు సంయుక్తంగా ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్, డీఎస్పీ శ్రీనివాసులు, ఎఫ్‌డీవో ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఆయా తండాల్లో దాచి ఉంచిన టేకు దుంగలతోపాటు ఒక నాటు తుపాకీ లభించినట్లు ఎఫ్ఆర్వో హిమచందన తెలిపారు.

క్రైం కార్నర్

వలలో చిక్కుకొని జాలరి మృతి

నవీపేట: మండలంలోని మిట్టాపూర్ గ్రామానికి చెందిన మేకల లింగం(44) చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు గోదావరిలో పడి మృతి చెందినట్లు ఎస్సై యాదగిరి గౌడ్ బుధవారం తెలిపారు. చేపలను వేటాడుతుండగా ప్రమాదవశాత్తు వలలో చిక్కుకుని పోశెట్టి నీటిలో మునిగి మృతి చెందాడన్నారు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు.

వాగులో వృద్ధుని మృతదేహం

రుద్రూర్: మండల కేంద్రం శివారులోని కాటి వాగులో వృద్ధుని మృతదేహం లభ్యమైంది. మృతుడు పోతంగల్ మండలం హంగర్గా గ్రామానికి చెందిన చాకలి నాగయ్య (70)గా గుర్తించారు. ఎస్సై అప్పారావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... నాగయ్య గత ఇరవై ఏళ్లుగా రుద్రూర్‌లోని తన అక్క నాగవ్వ వద్ద ఉంటున్నాడు. ఈ నెల 18న ఇంటి నుంచి వెళ్లిన నాగయ్య తిరిగిరాలేదు. ఆయన ఆచూకీ కోసం వెతుకుతున్న క్రమంలో బుధవారం గ్రామ శివారులోని వాగులో మృతదేహం కనిపించింది. వాగులో స్నానం చేస్తుండగా ఫిట్స్ రావడంతో మృతి చెంది ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు. మృతుడి అక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరి అదృశ్యం

ధర్పల్లి: మండలానికి చెందిన ఇద్దరు అదృశ్యమైనట్లు ఎస్సై విక్రమ్ బుధవారం తెలిపారు. ఓ గ్రామానికి చెందిన యువతి తన చదివిన కళాశాల నుంచి సర్టిఫికెట్లు తీసుకువస్తానని ఈనెల 18న ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుడితండాకు చెందిన యువకుడు..

మండలంలోని గుడితండాకు చెందిన మలావత్ తిరుపతి (22) అదృశ్యమైనట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. ఈనెల 18న హైదరాబాద్‌కు వెళ్తున్నానని ఇంటి నుంచి తిరుపతి వెళ్లాడు. ఆ తరువాత కుటుంబ సభ్యులు అతడికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో స్నేహితులు, బంధువుల ఇళ్లలో వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో యువకుడి తండ్రి ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష

ఖలీల్‌వాడి: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో న్యాయమూర్తి ముగ్గురికి జైలు శిక్ష విధించినట్లు ఏసీపీ నారాయణ తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వారిని బుధవారం నగరంలోని మార్నింగ్ కోర్టులో హాజరుపర్చగా, ముగ్గురికి రెండు రోజుల జైలుశిక్ష, ఆరుగురికి రూ.7వేల జరిమానా విధించినట్లు ఏసీపీ తెలిపారు.

దేవాయిపల్లికి చెందిన ఒకరికి..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన మండలంలోని దేవాయిపల్లికి చెందిన ఒకరికి కామారెడ్డి కోర్టు ద్వితీయశ్రేణి న్యాయమూర్తి రెండు రోజుల జైలుశిక్షతోపాటు రూ.200 జరిమానా విధించినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని, మద్యం సేవించి డ్రైవింగ్ చేయొద్దని సూచించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి చెందారు. ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి ఇద్దరు, గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు, ఎదురెదురుగా బైక్‌లు ఢీకొన్న ఘటనలో మరొకరు మృతి చెందారు.



మెగావత్ అర్జున్ (ఫైల్)

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని తాడెం వద్ద మంగళవారం రాత్రి ద్విచక్రవాహనం అదుపుతప్పిన ఘటనలో మంచిప్ప తండాకు చెందిన మెగావత్ అర్జున్(35) మృతి చెందాడు. ఎస్సై గంగాధర్ తెలిపిన వివరాల ప్రకారం.. అర్జున్ వ్యక్తిగత పనిపై రవితో కలిసి నిజామాబాద్‌వైపు బైక్‌పై వెళ్తుండగా తాడెం శివారులో వాహనం అదుపుతప్పింది. ఈ ఘటనలో అర్జున్ తలకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి రాత్రి ఒంటిగంట సమయంలో మృతి చెందాడు. రవి చేతులు, కాళ్లకు గాయాలుకాగా ప్రైవేట్‌ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడు అర్జున్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి తండ్రి మెగావత్ సోమ్లా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డివైడర్ రెయిలింగ్‌ను ఢీకొని..

బాల్కొండ: మండల కేంద్రం శివారులోని జాతీయ రహదారి 44పై బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలోని మిర్జాపూర్‌కు చెందిన రోహిత్‌కుమార్(23) అక్కడిక్కడే మృతి చెందాడు. ఎస్సై గోపి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లో నివాసం ఉండే రోహిత్‌కుమార్ తన స్నేహితుడు సత్యేంద్రకుమార్‌తో కలిసి బైక్‌పై నాగ్‌పూర్‌కు బయల్దేరాడు. బాల్కొండ శివారుకు చేరుకున్న సమయంలో బైక్ అదుపుతప్పి డివైడర్ రెయిలింగ్‌ను ఢీకొన్నది. ఈ ఘటనలో రోహిత్ తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సత్యేంద్రకుమార్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించామని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. రైలు టికెట్లు లభించక పోవడంతో బైక్‌పై హైదరాబాద్ నుంచి నాగ్‌పూర్ వరకు వెళ్లి.. బైక్ అక్కడ పెట్టి రైలులో యూపీకి వెళ్లాలని అనుకున్నట్లు సత్యేంద్రకుమార్ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

బాల్కొండ: మండల కేంద్రం శివారులోని జాతీయ రహదారి 44పై మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొనగా గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. హెచ్‌పీ పెట్రోల్‌పంప్ సమీపంలో మతిస్థిమితం లేకుండా తిరిగే వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అతడు మృతి చెందాడని ఎస్సై గోపి తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చికిత్స పొందుతూ మృతి..

బాల్కొండ: మండలంలోని వన్నెల్(బి)గ్రామ శివారులో వరద కాలువ వంతెనపై మంగళవారం రాత్రి ఎదురెదురుగా బైక్‌లు ఢీకొన్న ఘటనలో ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన టిప్పర్ డ్రైవర్ ఉద్ధవ్ మృతి చెందగా, వేల్పూర్ మండలం పడగల్ గ్రామానికి చెందిన రిషి(16) తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రిషి పరిస్థితి విషమించి మంగళవారం అర్ధరాత్రి తరువాత మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపి తెలిపారు.

10 గంటల్లో..

బాల్కొండ మండల పరిధిలో పది గంటల్లో జరిగిన మూడు ప్రమాదాల్లో నలుగురు మృతి చెందారు. వన్నెల్(బి) శివారులో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు, అర్ధరాత్రి తరువాత గుర్తు తెలియని వాహనం ఢీకొనిగుర్తు తెలియని వ్యక్తి, బుధవారం ఉదయం జాతీయ రహదారి 44పై రెయిలింగ్‌ను ఢీకొని యూపీకి చెందిన రోహిత్‌కుమార్ మృతి చెందారు. అన్ని ప్రమాదాలు అతివేగంగా వాహనాలను నడపడం కారణంగానే జరిగినవే. మంగళవారం రాత్రి 9 నుంచి బుధవారం ఉదయం 7 గంటల వరకు ఈ ప్రమాదాలు చోటుచేసుకున్నాయి.

పెళ్లి కావడంలేదని ఆత్మహత్య



పవన్ (ఫైల్)

వర్ని (చందూర్) : పెళ్లి కావడం లేదని మనస్తాపానికి గురై చందూర్‌కు చెందిన కొత్తోల్ల పవన్‌కుమార్(40) తన ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని వర్ని ఎస్సై కృష్ణకుమార్ తెలిపారు. మాజీ సైనిక ఉద్యోగి అయిన పవన్ తనకు 40 ఏళ్ల వచ్చినా పెళ్లి కావడం లేదని మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకున్నాడన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పరువు పోతుందనే భయంతో మరొకరు..

రెంజల్(బోధన్): డ్వాక్రా గ్రూపులో డబ్బులు చెల్లించకుంటే పరువుపోతుందనే భయంతో కందకుర్తి వద్ద గోదావరిలో దూకి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై సాయన్న తెలిపిన వివరాల ప్రకారం.. ఎడపల్లి మండలం అంబం గ్రామానికి చెందిన పోశెట్టి(39) వారం రోజుల క్రితం డ్వాక్రా గ్రూపులో చెల్లించాల్సిన డబ్బుల విషయంలో భార్యతో గొడవపడ్డాడు. భార్య తన పుట్టింటికి వెళ్లిపోగా, డ్వాక్రా డబ్బులు చెల్లించకపోతే పరువుపోతుందనే భయంతో పోశెట్టి గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యం పట్టివేత

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని న్యాల్‌కల్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న దుకాణంపై పోలీసులు బుధవారం దాడి చేశారు. గ్రామానికి చెందిన జలపతిరావు అనే వ్యక్తి మద్యం విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు దాడిచేసి 12లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామని ఎస్సై గంగాధర్ తెలిపారు. గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

వెస్లీనగర్ తండాలో..

డిచ్‌పల్లి: మండలంలోని వెస్లీనగర్ తండాలో కొనసాగుతున్న బెల్ట్‌షాప్‌పై దాడి చేసి 7.5లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. బెల్ట్‌షాప్ నిర్వహిస్తున్న రాథోడ్ ప్రకాశ్‌పై కేసు నమోదు చేశామన్నారు.